

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.50 (122.5225)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.45 (2.66)	84.39	84.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	97.21 (0.56)	నిల్	1749



ఆయకట్టు ఎదురుచూపులు

- మహారాష్ట్ర, కర్ణాటకల్లో వరదలొస్తేనే సాగర్ ప్రాజెక్టుకు నీరు
- ఎగువ జలాశయాలన్నింటిలో నీటి కొరతే
- జులైలో కురిసే వానలపైనే అందరి ఆశలు
- ఆగస్టు నాటికి నిండితేనే సాగర్ ఆయకట్టుకు నీరు

నల్లగొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : వరుసగా రెండు సీజన్లుగా నీటిఎద్దడి ఎదుర్కొన్న నాగార్జునసాగర్ ఆయకట్టు రైతులు ఈ వానాకాలంలో సాగునీటి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటినిల్వలు కనిష్ఠస్థాయిలో ఉండడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీటి కోసం ఎదురుచూడక తప్పనిపరిస్థితి. కృష్ణానది పరివాహక ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్రాల్లో భారీవర్షాలు, వరదలొస్తే తప్ప సాగర్‌కు నీరందని పరిస్థితి దశాబ్దాలుగా కొనసాగుతోంది. ప్రధానంగా ఆల్మట్టి ఎత్తు పెంచినప్పటి నుంచి ఎగువ ప్రాజెక్టులు నిండితే తప్ప దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు నీరందడం కష్టసాధ్యమవుతోంది. కృష్ణా, తుంగభద్ర, బీమా నదులపై కర్ణాటక, మాహారాష్టలోని ఆల్మట్టి, నారాయణపూర్, ఉజ్జయినీ, తుంగభద్ర డ్యాంలలో ఇప్పటివరకు కనిష్ఠ నిల్వలే ఉన్నాయి. వీటికితోడు ఎగువన ప్రధానంగా కర్ణాటకలో కృష్ణానదిపై ఉన్న రోడ్డు బ్రిడ్జిలన్నింటినీ రోడ్‌కమ్ బ్యారేజీలుగా మార్చడంతో వరదలొస్తే, ఈ బ్యారేజీల వద్ద నీరు నిండితే తప్ప దిగువకు వదలని పరిస్థితి నెలకొంది. దీంతో పూర్తిగా వరదలొచ్చి ఎగువన డ్యాంలు నిండి, బ్యారేజీలు నిండితేనే తెలంగాణలోని మొదటి ప్రాజెక్టు జూరాలకు నీరందే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం జూరాలకు ఎగువన ఉన్న ప్రాజెక్టులన్నింటిలోనూ కనిష్ఠ నీటినిల్వలే ఉండడంతో వరదల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. జూన్, జులై మాసాల్లో మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని కృష్ణా పరివాహక ప్రాంతాల్లో వర్షాలు సమృద్ధిగా కురిస్తే ఈ డ్యామ్‌లు నిండి, జులై చివరినాటికి జూరాల, శ్రీశైలానికి వరదతాకిడి మొదలవుతుంది. గతేడాది సానుకూల వర్షాలు లేకపోవడంతో దిగువకు నీరందలేదు. దీంతో సాగర్ ఆయకట్టుకు వానాకాలం, ఆ తర్వాత యాసంగిలోనూ క్రాప్ హాలిడే ప్రకటించడంతో రైతులు అరకొర సాగుతో అవస్థలు ఎదుర్కొన్నారు. ఈ ఏడాదైనా ఆ పరిస్థితి తప్పుతుందనే ఆశ ఆయకట్టు రైతుల్లో నెలకొంది.

నాగార్జునసాగర్‌లో కనిష్ఠ స్థాయిలో నీటినిల్వలు

ఉమ్మడి రాష్ట్రంలోని ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలో సుమారు 6.30 లక్షల ఎకరాలకు, పాటు ఏపీలోని గుంటూరు, ప్రకాశం, కృష్ణాజిల్లాల్లోని మరో 12 లక్షల ఎకరాలకు సాగునీరందించే నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లోనూ ఏడాదికాలంగా నీటినిల్వలు కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. జలాశయ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 312.505 టీఎంసీలకు డెడ్‌స్టోరేజీ సామర్థ్యం131.669 టీఎంసీలు. అయితే ప్రస్తుతం రిజర్వాయర్‌లో కేవలం 122.522 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెడ్‌స్టోరేజీకి దిగువకు నీటినిల్వలు పడిపోయిన పరిస్థితి కొనసాగుతోంది. ఎగువనుంచి వరదలొస్తే తప్ప, తాగునీటికి మినహా కాల్వలకు నీరివ్వలేని పరిస్థితి నెలకొంది.

నీటి నిల్వల సామర్థ్యం(టీఎంసీలలో)

రిజర్వాయర్	సామర్థ్యం	ప్రస్తుతం	లోటు
1. అలమట్టి	129.72	27.59	102.13
2. నారాయణపూర్	37.64	24.99	12.65
3. ఉజ్జయినీ	117.24	37.42	79.82
4. జూరాల	9.66	8.53	1.13
5. తుంగభద్ర	105.79	6.11	99.68
6. శ్రీశైలం	215.81	35.43	180.38
7. నాగార్జునసాగర్	312.05	122.52	189.53

నిండుకున్న జలాశయాలు

కృష్ణాబేసిన్‌లో ఉన్ని అన్ని రిజర్వాయర్లలో ప్రస్తుతం తాగునీటి అవసరాలకు మినహా నీటినిల్వల్లేని పరిస్థితి నెలకొంది. కృష్ణా, తుంగభద్ర, బీమా నదులపై ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్, ఉజ్జయినీ, జూరాల, తుంగభద్ర, శ్రీశైలం రిజర్వాయర్ల మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 615.86 టీఎంసీలకు గాను ప్రస్తుతం వీటన్నింటిలోనూ కలిపి 127.42 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ ప్రాజెక్టులన్నీ నిండి దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు నీరు రావాలంటే ఇంకా 488.44 టీఎంసీల నీరు కావాల్సి ఉంది. వరదలొస్తే తప్ప ఈ నీటిలభ్యత సాధ్యం కాని పరిస్థితిలో ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలపై అందరూ ఎదురుచూడాల్సి వస్తోంది. ప్రస్తుతం ఎగువ ప్రాజెక్టుల్లో విద్యుదుత్పత్తి, లీకేజీల ద్వారా శ్రీశైలానికి 7,471 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుంటే, నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో కనీస స్థాయిలో కూడా రావడం లేదు.

కృష్ణా బేసిన్‌లో

కృష్ణా బేసిన్ విస్తరించిన మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాల ఆధారంగానే వర్షాలు కురుస్తాయి. మొత్తం 13 సబ్‌బేసిన్లకు నాగార్జునసాగర్‌కు ఎగువన 8 సబ్‌బేసిన్లు ఉండగా, దిగువన అయిదు సబ్ బేసిన్లు ఉన్నాయి. కోయన, పంచగంగ, దూద్‌గంగ, ఘటప్రభ, మలప్రభ, బీమా, తుంగభద్ర, డిండి సబ్‌బేసిన్లలో నైరుతి రుతుపవనాలు జూన్‌లో ప్రవేశించిన తర్వాత అక్టోబరు వరకు బేసిన్ సగటు వర్షపాతంలో దాదాపు 70శాతం వర్షాలు పడతాయని వాతావరణశాఖ, కేంద్ర జల సంఘం అధ్యయనాల్లో పేర్కొంది. ప్రధానంగా నైరుతి రుతుపవనాలు బలపడ్డ తర్వాత జులై, ఆగస్టు, సెప్టెంబరులో భారీ వర్షాలు, తద్వారా వరదలు నమోదవుతున్నట్లు జలసంఘం అధ్యయనాల్లో పేర్కొన్నారు. ప్రతీ ఆరేళ్లలో నాలుగేళ్లు తప్పకుండా ఈ క్రమంలో వర్షాలు పడతాయని, మిగిలిన సీజన్లలో పరిస్థితి అంచనా వేయలేమని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. గతేడాది బేసిన్‌లో ఎగువ ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో సగటు వర్షపాతానికికంటే సగానికి తక్కువగానే వానలు పడ్డాయని, అందువల్ల దిగువకు నీరందలేదని చెబుతున్నారు. ఈ సారి ఆశాజనక పరిస్థితులు కనిపిస్తున్నాయని,జులై మొదటివారం నాటికి వర్షాలు మొదలై వరద రాక ఉంటుందని అంచనా వేస్తున్నారు.

వర్షపాతం గణనలో గందరగోళం..

నల్లగొండ : వర్షపాతం లెక్కింపులో గందరగోళం రైతులను అయోమయంలో పడేస్తోంది. ఉమ్మడి నల్లగొండజిల్లా వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు మందగించగా, వరుణుడు ముఖం చాటేశాడు. సాగు పనులు ముందుకు సాగడం లేదు. నల్లగొండ జిల్లాలో ఈ నెల 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు 130.2మి.మీలకు 155 మి.మీల వర్షం కురిసినట్లుగా వాతావరణ శాఖ రికార్డుల్లో నమోదైంది. అధికంగా 51.0మి.మీలు వర్షం ఉన్నట్లుగా పేర్కొంటున్నారు. మండలాన్ని యూనిట్‌గా లెక్కిస్తుండటంతో సమస్య మొదలవుతుంది. ఒకటి రెండు గ్రామాల్లో కురిసిన భారీ వర్షం మిగతా 90శాతం గ్రామాల్లో వర్షాభావ పరిస్థితులను లెక్కలోకి రాకుండా చేస్తోంది. దీంతో వర్షపాతం నమోదు వివరాలు వాస్తవ పరిస్థితులతో విస్మయం కలిగిస్తున్నాయి.

7

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆటలు



నర్సాపూర్‌లోవర్షాలకోసం చిన్నారుల కప్పతల్లి ఆటలు

రాజాపేట, జూన్ 17 : వర్షాలు కురవాలని కోరుతూ సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం నర్సాపూర్ గ్రామంలో చిన్నారులు కప్పతల్లి కాముడు ఆటలు ఆడారు. పొడవటి కట్టెకు తెల్లని వస్త్రంలో పసుపు, కప్పను పెట్టి, కట్టి చిన్నారులు గ్రామంలోని ఇంటింటికీ తిరిగారు. గ్రామస్థులు బిందెలతో నీటిని పోశారు. అనంతరం గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. కప్పతల్లి కాముడి ఆటతో వర్షాలు కురుస్తాయని ఆశాభావం వ్యక్తం చేసిన గ్రామస్థులు నెలరోజులుగా వర్షాలు లేకపోవడంతో విత్తనాలు వేయలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

సూర్యాపేట, నల్లగొండ

ఎస్పీల బదిలీ

- నల్లగొండకు శరత్‌చంద్ర పవార్, సూర్యాపేటకు సన్‌ప్రీత్ సింగ్
- రైల్వే ఎస్పీగా చందనాదీప్తి బదిలీ
- హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా రాహుల్‌హెగ్డే



సూర్యాపేట నూతన ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



నల్లగొండ నూతన ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ / సూర్యాపేట క్రైం, జూన్ 17 : ఉమ్మడి జిల్లాలోని నల్లగొం డ, సూర్యాపేట జిల్లాల ఎస్పీలు బదిలీ అయ్యారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. నల్లగొండ జిల్లా నూతన ఎస్పీగా శరత్ చంద్ర పవార్‌ను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న చందనాదీప్తిని సికింద్రాబాద్ రైల్వే ఎస్పీగా బదిలీచేశారు. 2016వ బ్యాచ్‌కు శరత్‌చంద్రపవార్ హైదరాబాద్‌లోని యాంటీ నార్కొటిక్ కంట్రోల్ బ్యూరోలో పనిచేస్తున్నారు. ఆయన గతంలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీగా, హైదరాబాదులో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించారు. సికింద్రాబాద్ పరిధిలోని ఈస్ట్ మారేడుపల్లికి చెందిన శరత్‌చంద్రపవార్ ప్రాథమిక విద్యాభ్యాసం హైదరాబాద్‌లో పూర్తికాగా ముంబైలోని ఐఐటీలో బీటెక్ పూర్తిచేశారు. మూడోప్రయత్నంలో ఐపీఎస్ సాధించారు. శరత్‌చంద్రపవార్ మామ ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ కాగా, తండ్రి బాలాజీనాయక్ డీఎంహెచ్‌వోగా వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. అదేవిధంగా సూర్యాపేట నూతన ఎస్పీగా జగిత్యాల జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న రాహుల్‌హెగ్డే బీకేను హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా బదిలీ చేశారు.



నెలాఖరులోగా బాలికల

భద్రత కమిటీలు

- ఆడపిల్లలపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు
- విద్యా, పోలీసు శాఖల సమన్వయంతో సాధికారత కమిటీలు

ప్రభుత్వ పాఠశాలల్లో నియమించే బాలికల సాధికారత భద్రత కమిటీల ఏర్పాటు ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తిచేయనున్నారు. విద్యాసంస్థలు ప్రారంభం కావడంతో కమిటీల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆడపిల్లలపై లైంగికదాడులు పెరిగిపోతున్న నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు ప్రతి యేటా ఈ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. దాడుల్లో భాగంగా సామాజికంగా బాలికలకు ఎదురవుతున్న లింగ వివక్ష, హింస, వేధింపులను బాల్య దశ నుంచే అరికట్టేందుకు ఏటా అన్నిప్రభుత్వ పాఠశాలల్లో బాలిక సాధికారత కమిటీలను నియమిస్తోంది. సమస్యలను ధైర్యంగా నిలువరించడం, అప్రమత్తంగా ఉండటం, ఆపదలో స్పందించాల్సిన తీరుపై కొత్త కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

\- భువనగిరి అర్బన్

బాలికల సాధికారత కమిటీలు విద్యా, పోలీసు(రెండు)శాఖల సమన్వయంతో కొనసాగుతాయి. ఇందులో పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు చైర్మన్‌గా, ఒక ఉపాధ్యాయురాలు(సభ్యులు) కన్వీనర్‌గా, షీ టీం ప్రతినిధులు, ప్రతీ తరగతి నుంచి ఇద్దరు చురుకైన అమ్మాయిలు సభ్యులుగా ఉంటారు. బాలికలు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలి, జీవితంలో విజయం సాధించేలా బాలికలను తీర్చిదిద్దడమే ఈ కమిటీల ముఖ్యఉద్దేశ్యం. సమాజంలో బాలికలపై ఎలాంటి అమానుష ఘటనలు చోటు చేసుకుంటున్నాయో ఈ కమిటీ ద్వారా వీరికి వివరిస్తారు. అలాంటి వారిని ఎదుర్కోవాలంటే మానసిక ధైర్యానికి తోడు చట్టం అండగా నిలుస్తుందని అవగాహన కల్పిస్తారు. ఆనమ్మకాన్ని కలిగించే విధంగా అధికారులు ఈ కమిటీల ద్వారా చర్యలు చేపడుతారు.

జిల్లాలో ఇలా...

యాదాద్రి జిల్లాలోని భువనగిరి, ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు మునుగోడు (చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం),తుంగతుర్తి (మోత్కూరు, అడ్డగూడూరు), నకిరేకల్ (రామన్నపేట) లతో కలిపి 17 మండలాలుగా విస్తరించింది. ఇందులో 712ప్రాథమిక, ప్రాథమికోన్నత,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు ఏడు మోడల్ స్కూళ్లు, 11 కస్తూర్బా, 3 రెసిడెన్షియల్ పాఠశాలల్లో మొత్తం 29,751వేల మంది బాలికలు వివిధ దశల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో కమిటీ నియామకం కోసం ఈనెలాఖరులోగా ఆదేశాలు ఇవ్వనున్నట్లు డీఈవో కే నారాయణరెడ్డి తెలిపారు.వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వరకు ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది.

లైంగిక దాడులపై అవగాహన...

బాల్యవివాహాలు, హింస వంటి సమస్యలపై మహిళ, శిశు సంక్షేమ శాఖ ప్రతినిధులతో అవగాహన కార్యక్రమాలు,లైంగిక దాడులు అడ్డుకోవడంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. ప్రధానంగా బాలికలు మానసికంగా ధైర్యంగా ఉండేందుకు శిక్షణఇస్తారు. బాలికల్లో ఎదుగుదలతో పాటు వచ్చే మార్పులు, శారీరక ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత, జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించడమే కాక బాలికల సంరక్షణకు చేపట్టాల్సి జాగ్రత్తలు, సహచరుల ఒత్తిళ్లకు 'నో' చెప్పడం తదితరాలను వివరిస్తారు. అదేవిధంగా ఆపదలో ఉన్నప్పుడు డయల్-100,1098,181,112వంటి టోల్ ఫ్రీనంబర్లను సంప్రదించేందుకు ఆయా పాఠశాలల్లో ప్రదర్శిస్తారు.

ఈనెలలోపు కమిటీల నియామకాలకు ఆదేశాలు ఇస్తాం




ఈనెల లోపు కమిటీలు నియమించేందుకు ప్రత్యేకంగా ఆదేశాలు ఇస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల సాధికారత కమిటీల ఏర్పాటు చర్యలు వేగవంతం చేశాం. ఎలాంటి క్లిష్ట పరిస్థితులోనైనా మనోధైర్యంతో ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండేందుకు బాలికలను తీర్చిదిద్దుతాం. ప్రతీ ఒక్క బాలికలు పాఠశాలలు, కుటుంబాలతో పాటు సమాజంలో గౌరవం పెంచేందుకు మార్పు రావాల్సి అవసరం ఉంది.

\- కే.నారాయణరెడ్డి, డీఈవో, యాదాద్రిభువనగిరి

పర్యాటక కేంద్రంగా ఉదయసముద్రం

- ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులను పరిశీలిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, జూన్ 17 : జిల్లా కేంద్రాన్ని అన్నిరకాలుగా తీర్చిదిద్దడంతో పాటు, ఉదయ సముద్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం ఆయన పానగల్ ఫ్లైఓవర్ సర్వీస్ రహదారిలో రూ.5 కోట్లతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించారు. అధికారులు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. మ్యాన్‌హోల్స్ వద్ద క్యూరింగ్ బాగా చేయాలన్నారు. పట్టణానికి డ్రైనేజీ సమస్య లే కుండా, శాశ్వత పరిష్కారం ఉండేలా పనులు చేపట్టాలన్నారు. గత ప్రభుత్వంలో డ్రైనేజీ లైన్ తీయకుండా హడావుడిగా పనులు పూర్తి చేయడం వల్ల పానగల్ ఫ్లైఓవర్ వద్ద ఇబ్బందులు తలెత్తాయని దీంతో రూ.5.5 కోట్లు మంజూరు చేయించి భూగర్భ డ్రైనేజీ పనులను పూర్తి చేయిస్తున్నామన్నారు. జాతీయ రహదారిని పట్టణంలో నుంచి తీసుకెళ్లడం ద్వారా రామాలయం, చర్చి, ఆంజనేయస్వామి గుడి, కబరస్తాన్, దేవరకొండ రోడ్ లోని షాపులు వంటివి కోల్పోతున్నందున పట్టణం నుంచి జాతీయ రహదారి వెళ్లకుండా పట్టణం అవతలి నుంచి రూ.700 కోట్లతో రింగ్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. పట్టణంలోకి భారీ వాహనాలు ఏవీరాకుండా ఔటర్ రింగ్ రోడ్డు పైనుంచి వెళ్లేలా పనులు ప్రారంభిస్తామన్నారు. దీంట్లో భాగంగానే పానగల్లు వద్ద ఛాయా సోమేశ్వరాలయం సమీపంలో ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి చౌరస్తాను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఉదయసముద్రాన్ని టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని, చందనపల్లి వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌లో ట్రీట్మెంట్ ప్లాంటు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. పట్టణంలో ప్రమాదాలు జరగకుండా పటిష్ఠమైన సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు ప్ర మాదాలకు కారణమయ్యే చెట్లను తొలగిస్తున్నామని వివరించారు. మంత్రితో పాటు మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రె డ్డి,వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నల్లగొండ కల్చరల్: ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని పట్టణంలో మునుగోడు రోడ్డులోని ఈద్గాలో సోమవారం నిర్వహించిన వేడుకలకు ఆయన హాజరయ్యారు. ప్రార్థనల అనంతరం ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ చందనాదీప్తి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఏఎస్పీ రాములునాయక్, డీఎస్పీ శివరాంరెడ్డి, ముస్లింలు పెద్దలు డాక్టర్ హఫీజ్‌ఖాన్, ఏకేఖాన్, సయ్యద్ జాఫర్, జునైద్‌హాష్మీ, ఇంతియాజ్, నేషనల్ షరీఫ్, ఆస్రఫ్, ఆర్డీవో రవి, మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మోహితుల్లా, జీవీ యాదవ్, అల్లి సుభాష్, అభిమన్యు శ్రీనివాస్ పాల్గొన్నారు.

త్యాగాలకు ప్రతీక బక్రీద్



నల్లగొండలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

8

ఎల్లమ్మతల్లికి ఘనంగా బోనాలు

ముగిసిన దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు

కనగల్, జూన్ 17 : ఎల్లమ్మ తల్లికి బోనాల సమర్పణతో దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం సాయంత్రంతో ముగిశాయి. మండలంలోని దర్వేశిపురం, పర్వతగిరి గ్రామస్థులు పెద్దసంఖ్యలో అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఆయా గ్రామాల నుంచి మహిళలు రెండు కిలోమీటర్ల మేర కాలినడకన బోనాలను ఎత్తుకుని ఊరేగింపుగా తరలివచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణల అనంతరం పరుశురాముని గుడి వద్ద ఇష్టదైవానికి అత్యంత భక్తిశ్రద్ధలతో నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు ఉదయం సంప్రదాయబద్ధంగా సమర్పించే సత్తెన బోనాలను మొదట అమ్మవారికి అందజేశారు. 108 కలశాలతో అష్టోత్తర శతఘటాభిషేక మహోత్సవం త్రిశూలస్నానం, నీరాజన మంత్రపుష్ప పూజలతో పాటు పండిత సత్కారం జరిగింది. బోనాల సమర్పణతో జాతర ముగిసిందని ఈవో జయరామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ చెనగోని నగేష్‌గౌడ్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ మాజీ చైర్మన్లు దేప కరుణాకర్‌రెడ్డి, కంచకుంట్ల గోపాల్‌రెడ్డి, యాదగిరి నాయకులు, సీనియర్ అసిస్టెంట్లు జినుకుంట్ల చంద్రయ్య, లింగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



బోనాలతో మహిళా భక్తులు

ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి

ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పాలడుగు ప్రభావతి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభావతి

నల్లగొండ రూరల్, జూన్ 17 : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, ఆరు గ్యారెంటీలను వెంటనే అమలుచేయాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. నల్లగొండ పట్టణలోని దొడ్డికొమరయ్య భవనంలో సోమవారం నిర్వహించిన ఐద్వా జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్, ఉచిత బస్, సబ్సిడీపై గ్యాస్‌సిలిండర్ వరకే పరిమితం కాకుండా ఇతర వాగ్దానాలను వెంటనే అమలు చేసి తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం ఉచితంగా అందించేందుకు నిధులు కేటాయించాలన్నారు. సంఘం ఆధ్వర్యంలో ప్రైమరీ హెల్త్ సెంటర్లు, జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో సమగ్రంగా సర్వేలు నిర్వహించి ఆరోగ్య సేవలపై ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడానికి కార్యక్రమం రూపొందించామన్నారు. సమభావన సంఘాల మహిళలకు అందాల్సిన పావలా వడ్డీ నేటికీ ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. సంఘాల మహిళలకు ప్రతి ఒక్కరికీ ప్రభుత్వమే బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో మహిళలపై అనేక అఘాయిత్యాలు జరుగుతున్నాయని, వృద్ధుల నుంచి పసిపిల్లల వరకు లైంగిక దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, సహాయకార్యదర్శి భూతం అరుణకుమారి, జనబోయిన నాగమణి, పాతూరి గోవర్ధన, కారంపూడి ధనలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యురాలు గోలి వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యాచకుడి మృతదేహం లభ్యం

దేవరకొండ, జూన్ 17: దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని యాచకుని మృతదేహం లభ్యమైనట్లు దేవరకొండ సీఐ నరసింహులు తెలిపారు. సోమవారం సాయంత్రం కొండభీమనపల్లి గ్రామశివారు గిరిజానగర్ తండా సమీపంలో సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతి చెందాడని తండావాసులు పోలీసులకు సమాచారం అదించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. చనిపోయిన వ్యక్తికి 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉంటుందని, మృతుని కుడి చేతి ఉంగరం వేలుకు రోల్డ్ గోల్డ్ ఉంగరం ఉందని, బ్లూ, మరియు తెలుపు గీతల డబ్బాల చొక్కా కలిగి ఉన్నాడని తెలిపారు. మొలతాడుకు తాయత్తు కట్టి ఉన్నట్లు సీఐ తెలిపారు. మూడు, నాలుగు రోజులుగా కొండభీమనపల్లి గ్రామ శివారులో తిరుగుతున్నాడని గ్రామస్థులు తెలిపినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

9.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

గుర్రంపోడు, జూన్ 17: మండలంలోని తేనెపల్లి గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న 9.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం నర్సింహులగూడెం గ్రామానికి చెందిన తాళ్ల శేఖర్, తేనెపల్లి గ్రామానికి చెందిన యాదయ్య అనే వ్యక్తి సహాయంతో బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు చేశారు. ఈ మేరకు ఆటోను తనిఖీ చేయగా 19 ప్లాస్టిక్ బస్తాల్లో 9.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో ఎవరైనా రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివప్రసాద్ హెచ్చరించారు.

శ్రీకృష్ణ రథయాత్రను విజయవంతం చేయాలి

దేవరకొండ, జూన్ 17: దేవరకొండ పట్టణానికి జూలై 10వ తేదీన రానున్న పూరీ జగన్నాథ్ శ్రీకృష్ణ రథయాత్రను విజయవంతం చేయాలని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ అధ్యక్షుడు చీదేళ్ల వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం వాసవీ కల్యాణ మండపంలో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో జగన్నాథ్ శ్రీకృష్ణ రథయాత్ర పోస్టర్లు, కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. యాత్ర సందర్భంగా దేవరకొండలో మహిళలు, యువకులతో కోలాటాలు, నృత్య ప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు. దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి రథయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, నక్క వెంకటేష్‌యాదవ్, ఆలయ కమిటీ నిర్వాహకులు ఇల్లందుల శ్రవణ్‌కుమార్, వాస వెంకటేశ్వర్లు, సుదర్శన్, శ్రీరాములు, ఆలయకమిటీ చైర్మన్ జయలక్ష్మి, గోవిందు శైలజ, మహాలక్ష్మి, మాధవి, పంగునూరి లింగయ్య, కర్నాటి జనార్ధన్, ఎస్ఎన్.చారి, సుబ్బారావు పాల్గొన్నారు.



రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ కమిటీ సభ్యులు

నేడు యాద'గిరి' ప్రదక్షిణం

● దేవస్థానమే భక్తులను ఆహ్వానించడం తొలిసారి



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ వ్యూ

భువనగిరి అర్బన్, జూన్ 17: తెలంగాణకే తలమానికంగా వెలుగొందుతున్న యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామికి ప్రతి నెల స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున గిరిప్రదక్షిణ చేయడం ఇక్కడ ఆనవాయితీ. ఈ నెల 18న చేపట్టబోవు స్వామివారి స్వాతి నక్షత్రం రోజున తొలిసారి దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టే గిరిప్రదక్షిణ కార్యక్రమానికి స్థానిక, స్థానికేతర భక్తులు సుమారు 5వేల మందిని భాగస్వాములను చేయాలని ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. ఉదయం 5.30గంటలకు ప్రదక్షిణ చేసే భక్తులు కొండకింద వైకుంఠ ద్వారం చెంతకు చేరుకోవాలి. ఎప్పటి నుంచో సాగుతున్న ఈ సంప్రదాయానికి కొండచుట్టు ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ప్రత్యేకంగా రోడ్డు నిర్మించేందుకు అధికారులు పనులు చేపట్టారు. కానీ ఈ పనులు నత్తనడక సాగడంతో కాలక్రమేణా నిలిచిపోయాయి. నేడు జరగబోయే గిరిప్రదక్షిణ కార్యక్రమానికి ఇదే రోడ్డును భక్తుల కోసం అందుబాటులోకి తెచ్చేందుకు వారం రోజులుగా రోడ్డు పనులు శరవేగంగా వైటీడీఏ ఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో పూర్తి కాగా, ఆలయ ఈవో పరిశీలించారు.

గిరి ప్రదక్షిణ ప్రాధాన్యం



గిరిప్రదక్షిణ రోడ్డును వైటీడీఏ, ఆలయ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఈవో భాస్కర్‌రావు

గిరిప్రదక్షిణ వల్ల దుష్ట, గ్రహ, వ్యాధి గ్రహ, ప్రయోగ బాధ నివారణ, గ్రహ దోష నివారణ, సంతానార్థులకి సంతానం, వివాహం కావాల్సిన వారికి వివాహం తదితర కోర్కెలతో ప్రదక్షిణ వల్ల ప్రాప్తిస్తాయని భక్తుల విశ్వాసం. ఇందులో భాగంగా వేకువ జామున వైకుంఠ ద్వారం నుంచి స్థానిక భక్తులు బయలుదేరి తిరిగి అక్కడికే చేరుకుని స్వామివారి పాదాల వద్ద మొక్కులు తీర్చుకుంటారు. కొండపైన ఆలయంలోని స్వయంభువులను దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులవుతారు. గిరిప్రదక్షిణతో స్థానిక భక్తులు స్వామివారి విశిష్టతను నలు దిక్కుల నేటి తరానికి చాటిచెబుతున్నారు. మరింత భక్తుల్లో భక్తిభావం పెంపొందించే సంకల్పంతో ఆలయ అధికారులు గిరిప్రదక్షిణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనేందుకు వారం రోజుల పాటు దిన పత్రికలతో పాటు ఇతర ప్రచార సాధనాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టారు. స్వామివారి మహిమలతో గ్రహ, గృహ బాధలు తొలగి ప్రశాంతమైన జీవనం ప్రసాదించునని నమ్మకం.

లక్ష్మీనృసింహుడికి లక్ష పుష్పార్చన



లక్షపుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఏకాదశి పూజలు వైభవంగా చేపట్టారు. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన పూజారులు గర్భాలయంలో కొలువుదీరిన స్వామిఅమ్మవార్లను మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలు, తులసీదళాలతో అర్చించారు. స్వామిఅమ్మవార్ల సహస్రనామార్చనలను పఠిస్తూ లక్షపుష్పార్చన చేపట్టారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ లక్ష్మీనృసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.66,21,151 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.

కొండపై కురిసిన వర్షం

భువనగిరి అర్బన్ : రోజంతా తీవ్ర ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి కాగా మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతం అయి పూర్తిగా చల్లబడింది. కొద్దిసేపు చల్లగా.. కొద్దిసేపు ఉక్కపోతతో యాదగిరికొండపైన భక్తులు ఇబ్బందులు పడ్డారు. సుమారు 5.30 నుంచి 6గంటల వరకు కురిసిన వర్షానికి భక్తులు తలదాచుకునేందుకు తగినంత చోటు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం వర్షం తగ్గుముఖం పట్టగా వారి ప్రాంతాలకు తిరిగి వెళ్లారు. వర్షం కురిసే సమయంలో నిల్చునేందుకు సౌకర్యాలు లేక ఆలయ ఉత్తర దిశలోని షెడ్డు కింద తలదాచుకున్నారు. కానీ, చుట్టూ కురిసిన వర్షాలకు షెడ్డు లోపల భాగం పూర్తి వర్షం నీటితో తడిసిపోయింది. దీంతో భక్తులు నిల్చునే ఉండటం గమనార్హం.

ముందుకు సాగని పత్తి విస్తీర్ణం

» ఇప్పటి వరకు 1.50లక్షల ఎకరాల్లోనే పడిన విత్తనాలు
» వర్షాలు కురవక పోవడంతో నిలిచిపోయిన పత్తిసాగు
» మండల యూనిట్‌గా వర్షపాతం గణనతో సమస్యలు
» ఆందోళనకు గురవుతున్న రైతాంగం



నల్లగొండ, జూన్ 17: గత నెల కురిసిన అకాల వర్షాలతో వేసవి దుక్కుల్లో పత్తి విత్తనాలు వేసిన రైతులు నైరుతి రుతుపవనాలతో జూన్ మొదటివారంలో పత్తి విత్తనాలు వేశారు. అయితే నైరుతి రుతుపవనాలు మందగించడం, వరుణుడు ముఖం చాటేయడంతో పత్తి విత్తన సాగు ముందుకుసాగడం లేదు. దీనికి ప్రధాన కారణం వర్షాలు కురియకపోవడమేనని స్పష్టమవుతుంది. జిల్లాలో చిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 1 నుంచి 17వ తేదీ వరకు 130.2 మి.మీలకు గాను 155 మి.మీల వర్షం కురిసినట్లుగా వాతావరణ శాఖ రికార్డులో నమోదు చేసింది. అధికంగా 51.0 మి.మీలు వర్షం ఉన్నట్లుగా పేర్కొంటున్నారు. వాస్తవానికి అయితే మండల యూనిట్‌గా వర్షపాతం లెక్కిస్తుండటంతో సమస్య మొదలవుతుంది. ఒక్క మండలం, ఒక్క గ్రామంలో, లేదంటే నాలుగు గ్రామాల్లో అధికంగా వర్షం కురియడం, మిగతా గ్రామాల్లో సాధారణ వర్షపాతం ఉన్నా ఆ మండలంలో అధిక వర్షపాతం ఉన్నట్లుగా వాతావరణ శాఖ పేర్కొనడం గమనార్హం. అసలు సీపీవో కార్యాలయం ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో వర్షపాత నమోదు లెక్కింపు ఉన్నా అక్కడి నుంచి నివేదికలు తీసుకోకపోవడంతో సమస్యలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో వర్షాలు కురవక రైతులు ఇబ్బందులు పడుతున్నా వాతావరణ శాఖ మాత్రం నల్లగొండ జిల్లాలో అధికంగా వర్షపాతం నమోదైనట్లు చెప్పడం గమనార్హం. గ్రామాల వారీగా వర్షపాతం గణన కోసం ఏర్పాట్లు చేయాలన్నా డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నా ప్రభుత్వం పట్టించుకునే దాఖలాలు లేవు.

ఇప్పటి వరకు 1.50 లక్షల ఎకరాల్లోనే పత్తి విత్తనాలు

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 5.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తుంది. ఇందుకు గాను 15 లక్షల పత్తి విత్తనాల ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. అడపాదడపా కురిసిన వర్షాలతోనే సాధారణ వర్షపాతం కంటే అధికంగా వర్షం పడిందని అధికారులు పేర్కొంటుండగా వాస్తవ పరిస్థితులు వేరే విధంగా ఉన్నాయి. వారం రోజులుగా జిల్లాలో రైతులు పత్తి విత్తనాలు వేయడం నిలిపివేశారు. ఈ నెలాఖరు వరకే పత్తి విత్తనాలు వేసే అవకాశం ఉంటుంది. జిల్లాలో మాత్రం దిగుబడులతో సంబంధం లేకుండా వర్షాలు ఎప్పుడు కురిసినా విత్తనాలు వేస్తుంటారు. జూలై నెలాఖరు వరకు పత్తి విత్తనాలు వేసే అవకాశం ఉంది. జూన్ మొదటి వారంలో మోస్తారు వర్షాలు కురవగా భారీ వర్షాలకు మాత్రం జాడ లేకుండా పోయింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పత్తి విత్తనాలు కేవలం ఇప్పటి వరకు 1.50 లక్షల ఎకరాల్లోనే వేశారు. భూమిలో తేమ లేకపోవడంతో విత్తనాలు వేయడం లేదు. ఈ పాటికే 4 లక్షల ఎకరాలకు పైగా పత్తి విత్తనాలు వేసే అవకాశం ఉండేది. అందుకు భిన్నంగా పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. దీంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. ఈ ఏడాది సాధారణం కంటే అధికంగా వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ ఆశించినా జూన్ మూడో వారం ప్రవేశిస్తున్నా వర్షాలు కురవడం లేదు. రైతులు కూడా వర్షాలు మించి పోవడంతో ఉన్న కొద్ది పాటి తేమలో కూడా విత్తనాలు వేయడంలో వెనకంజ వేస్తున్నారు. పత్తి చేనులో కొంత మంది రైతులు మాత్రం గుంటుక తోలుతున్నారు.

ఆందోళనలో రైతాంగం..

ఓ వైపు ప్రభుత్వం రైతు భరోసా (రైతుబంధు)కు సంబంధించి నిధులు విడుదల చేయకపోవడంతో జిల్లా రైతుల చేతుల్లో పెటుబడులు లేవు. గత పార్లమెంటు ఎన్నికలకు ముందు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత భూమి ఉన్నా రైతులందరికీ రైతుబంధు నిధులను విడుదల చేసింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా రైతుభరోసాపై మార్గదర్శకాలు రూపొందించకపోవడంతో రైతుభరోసా సాయం ఎప్పుడు అందుతుందో తెలియని పరిస్థితి ఉంది. ఓ వైపు చేతుల్లో పెట్టుబడులు లేకపోవడం, మరో వైపు అప్పులు చేసి వ్యవసాయం మొదలు పెట్టడం,తీరా వానలురాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనతో నిరాశ నిస్పృహలతో ఉన్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా పడి గట్టెక్కుతామనుకున్న రైతులకు ఇబ్బంది పడే పరిస్థితులు ఎదురయ్యాయి. మరో మూడు నాలుగు రోజులు వర్షాలు కురవక పోతే ఇప్పటికే పత్తి మొలకలు సైతం వాడిపోయే పరిస్థితి ఉంటుంది. జూన్ నెలాఖరులోగా పత్తి విత్తనాలు పడకపోతే పత్తి దిగుబడులపై కూడా తీవ్ర ప్రభావం చూపించనుంది. గతేడాది సైతం పత్తిసాగు, దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు నష్టపోయిన విషయం తెలిసిందే. ఇకపోతే ఇప్పటివరకు జనుము 10,211ఎకరాల్లో,జీలుగ 5,121 ఎకరాలు, చెరుకు 14ఎకరాలు, జొన్నలు 15ఎకరాలు, పెసర్లు 45ఎకరాల్లో మాత్రమే వేశారు.

వారం రోజులుగా పత్తి సాగు ఆగింది



ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో ఆశాజనకంగానే సాగు అయింది. పత్తి 1.50 లక్షల ఎకరాల్లో వేశారు. అయితే వారం రోజులుగా వర్షాలు కురియకపోవడంతో రైతులు పత్తి విత్తనాలు వేయకుండా నిలిపి వేశారు. వర్షాలు లేనప్పుడు విత్తనాలు వేయకపోవడమే మంచిది. రైతులకు కూడా అవగాహన రావడం వల్ల తేమ లేనప్పుడు విత్తనాలు వేయడం లేదు. రాబోయే రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశాలు ఉన్నాయి. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దు.

\- పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ నల్లగొండ

వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులు

దేవరకొండ: దేవరకొండ డివిజన్‌లో ఈ నెల మొదటి వారంలో వర్షాలు కురియడంతో ఎంతో ఆనందంతో దుక్కులు దున్నుకొని కొంత మంది రైతులు పత్తి విత్తనాలు వేశారు. కానీ వర్షాలు కురవకపోవడం, మేఘాలు ఊరిస్తుండటంతో వేసిన పత్తి విత్తనాలు మొలకెత్తక రైతులు వర్షం కోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. దేవరకొండ డివిజన్‌లో ఈ ఏడాది 1. 71 లక్షల ఎకరాల్లో పత్తిపంట సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు డివిజన్ పరిధిలోని చందంపేట, దేవరకొండ, డిండి మండలాల్లో 20 వేల ఎకరాలకు పైగా పత్తి విత్తనాలు వేశారు. కానీ వర్షాలు కురియపోవడంతో విత్తనాలు మొలకెత్తక నష్టపోయే పరిస్థితి నెలకొంది. రైతులు దుక్కులు దున్నుకొని, విత్తనాలు సిద్ధం చేసుకొని వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. మేఘాలు ఊరిస్తున్నా వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

శ్రీవారిని దర్శించుకున్న మంత్రి ఉత్తమ్ దంపతులు

నల్లగొండ, జూన్ 17: కోదాడ శాసనసభ్యురాలు పద్మావతి ఉత్తమ్ జన్మదిన సందర్భంగా రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిఉత్తమ్ కుటుంబ సమేతంగా తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మంత్రి, ఎమ్మెల్యే కుటుంబీకులకు ఆలయ మర్యాదలతో స్వాగతం చెప్పి, ఆశీర్వచనం పలికారు. స్వామివారి శేషవస్త్రాలతో మంత్రి దంపతులను సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా తిరుచానూరు పద్మావతి అమ్మవారిని, శ్రీకాళహస్తిలోని వాయిలింగేశ్వర సహిత జ్ఞాన ప్రసూనాంబదేవి, దక్షిణామూర్తి ఆలయాల్లోనూ మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం తిరిగి వస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి దంపతులు, కుటుంబసభ్యులు

స్వర్ణగిరీశుడికి ఇక పూర్తిస్థాయి ఆర్జిత సేవలు

● 100 రోజుల్లో 46 లక్షల మంది భక్తుల రాక
● అందుబాటులోకి ఆన్‌లైన్ సేవలు
● విలేకరుల సమావేశంలో ఆలయ ధర్మకర్తలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ ధర్మకర్తలు

యాదాద్రి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో కొలువైన స్వర్ణగిరీశుడి ఆలయంలో ఇకపై పూర్తిస్థాయిలో ఆర్జిత సేవలు భక్తులకు అందుబాటులో ఉంటాయని ఆలయ ధర్మకర్తలు మానేపల్లి రామారావు, మానేపల్లి మురళీకృష్ణ, గోపీకృష్ణ తెలిపారు. శ్రీ స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ప్రారంభించి 100 రోజులు పూర్తయిన సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.100 రోజుల్లో దేశం నలుమూలల నుంచి దాదాపు 46 లక్షల మంది భక్తులు స్వర్ణగిరీశుడిని దర్శించుకున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు సన్నాహాలు చేస్తున్నామని పేర్కొన్నారు. దూరప్రాంతాల నుంచి విచ్చేసే వారు ఏ మాత్రం నిరాశపడకుండా స్వామివారి దర్శనం చేసుకోవచ్చని, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు మాత్రమే విరామం ఉంటుందన్నారు. శని, ఆదివారాల్లో ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు నిరంతరాయంగా స్వామివారిని దర్శించుకోవచ్చని వె ల్లడించారు. షోడశ కళామూర్తికి చేసే షోడశోపచార సేవల్లో భాగంగా ఉదయం 5 గంటలకు ఆరంభమయ్యే సుప్రభాత సేవలు మొదలుకుని, ఏకాంత సేవ వరకు.. మొత్తం 16 ఆర్జిత సేవలు భక్తులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. గోశాలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. భక్తుల కోసం అన్నప్రసాద వితరణ కూడా అందుబాటులోకి తెచ్చామని, మొదట్లో రెండు వేల మందికి మాత్రమే పరిమితమైందని, ప్రస్తుతం నిత్యం 8 వేల మంది ప్రసాదం స్వీకరిస్తున్నారని చెప్పారు.

అందుబాటులోకి ఆన్‌లైన్ సేవలు

స్వామివారి అన్ని రకాల ఆర్జిత సేవలను ఆలయ వెబ్‌సైట్ (వైటీడీ టెంపుల్) ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. అన్నదాన ప్రసాదం, ఇతర సేవల కోసం స్వామివారి హుండీ ద్వారా విరాళాలు చెల్లించవచ్చని సూచించారు. విరాళాలు అన్నింటికీ సెక్షన్ 80జీ ద్వారా ఆదాయ పన్ను మినహాయింపు కూడా ఉంటుందని పేర్కొన్నారు. వృద్ధులకు, దివ్యాంగులకు వీల్‌ఛైర్ ద్వారా ప్రత్యేక దర్శనానికి ఏర్పాట్లు చేశామన్నారు.

'చేనేత సంఘాల ఎన్నికలు నిర్వహించాలి'

నల్లగొండరూరల్, జూన్ 17: చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం వెంటనే ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వనం శాంతికుమార్, గంజి మురళీధర్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. చేనేతరంగాన్ని కేంద్రప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల తరహాలో చేనేత వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చేనేత సంఘం నాయకులు దండెంపల్లి సత్తయ్య, రాపోలు రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎంగా రాజశేఖర్

నల్లగొండ, జూన్ 17: ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌గా రాజశేఖర్ నియ మితులయ్యారు. ఈ మేరకు ఆర్టీసీ బస్ భవన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు ఆర్‌ఎంగా పనిచేసిన శ్రీదేవిని హైదరాబాద్‌లోని బస్‌భవన్‌కు బదిలీ చేశారు. ఆమె స్థానంలో ఐటీ విభాగంలో పనిచేస్తున్న చీఫ్ ఇంజనీర్ రాజశేఖర్‌ను ఆర్‌ఎంగా నియమించారు. ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ ఆత్మహత్య

మఠంపల్లి, జూన్ 17: కుటుంబ సమస్యలతో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని అవిరెనికుంటతండా శివారులో సోమవారం జరిగింది. మఠంపల్లి ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం తాళ్లపాడు గ్రామానికి చెందిన తన్నీరు శివన్నారాయణ(30)ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తు న్నాడు. వారం రోజుల నుంచి మండలంలోని అవిరెనికుంటతండా శివారులోని పొలాల్లో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఎక్స్‌కవే టర్ యాజమాని ఆదివారం ఉదయం స్వగ్రామానికి వెళ్లాడు. సాయంత్రం వరకు పనిచేసిన శివన్నారాయణ రాత్రి తండాకు వెళ్లి అన్నం తిని ఎక్స్‌కవేటర్ వద్దకు వచ్చి నిద్రించాడు సోమవారం నిద్రలేచిన తర్వాత. ఎక్స్‌కవేటర్‌కు లుంగీతో ఉరేసుకున్నాడు. పొలం చుట్టుపక్కల రైతులు గుర్తించి తండావాసులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ రామాంజనేయులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలను సేకరించారు. కుటుంబ సమస్యలతో శివనారాయణ ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు భావిస్తు న్నారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. శివన్నారాయణ తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

తిరుమలగిరి రూరల్, జూన్ 17: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోట్యానాయక్‌తండాకు చెందిన ధరావత్ దేవోజీకి చెందిన ఎద్దులు సోమవారం గ్రామ శివారులో మేత మేస్తుండగా, ఒక ఎద్దుకు ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలి విద్యుదాఘాతంతో అక్కడిక్కకే మృతి చెందింది. ఈ ప్రమాదంలో రూ.80వేల విలువైన ఎద్దు మృతి చెందిందదని, అరకకు మరో ఎద్దు లేక వ్యవసాయం ఆగిపోతుందని, ప్రభుత్వం తనకు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు.


మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి



రాస్తారోకో చేస్తున్న మృతుడి బంధువుల కుటుంబ సభ్యులు

మోతె, జూన్ 17: ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు రాస్తారోకో చేశారు. ఈ ఘటన సోమవారం సూర్యాపేట జిల్లా మోతె మండలం పరిధిలోని సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిపై జరిగింది. మోతె మండంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన మంద ఉపేందర్ (32) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఉపేందర్ తుమ్మలపల్లి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఉపేందర్‌కు ఢీకొట్టిన ట్రాక్టర్ అధికార పార్టీ వారికి చెందినందున, ఆ ట్రాక్టర్‌ను మార్చి పోలీసులు మరో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదు చేశారని మృతుడి బంధువులు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు సోమవారం పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్ ఎదుట, సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిపై ఏకకాలంలో రాస్తారోకో చేశారు. దీంతో మధ్యాహ్నం 2:30గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిపై ఇరువైపులా రెండు కిలోమీటర్ల దూరం ట్రాఫిక్ జాం అయింది. సూర్యాపేట డీఎస్పీ రవి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మునగాల, నడిగూడెం ఎస్‌ఐలు యాదవేందర్‌రెడ్డి, అజయ్‌కుమార్‌ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను బాధిత కుటుంబ సభ్యులు విరమించారు. తదనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గొర్రెల పంపిణీ అవకతవకలపై విచారణ చేయాలి



వెలిశాల గ్రామంలో మాట్లాడుతున్న లింగయ్య

తిరుమలగిరి రూరల్, జూన్ 17: బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2017లోప్రవేశ పెట్టిన గొర్రెల పంపిణీ పథకంలో అవకతవ కలకు పాల్పడిన వారిపై న్యాయ విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని జీఎంపీఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని వెలిశాల గ్రామంలో జరిగిన గొర్రెల, మేకల సంఘం మండల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ పథకంలో రూ.100కోట్ల అవినీతి జరిగిందని, నిందితులను అరెస్టు చేసి డబ్బులు రికవరీ చేసి గొల్లకురుమలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రెండో విడత డీడీలు తీసి సంవత్సరం కావస్తున్నా గొర్రెల పంపిణీ చేయలేదని, కనీసం డబ్బులుతిరిగి ఇవ్వలేదని అన్నారు. కార్యక్రమంలో కడారి లింగయ్య, జి.హెచ్. సోమమల్లు, డి.రాములు తదితరులు పాల్గొన్నారు

సొంత భవనాలు ఎప్పుడో?

» అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
» ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, క్రయ, విక్రయదారులు



సూర్యాపేటలో అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

నిత్యం లక్షల రూపాయల రాబడితో వందల మంది ప్రజలతో కిటకిటలాడే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నందున ఉద్యోగులు, సిబ్బందితో పాటు క్రయ, విక్రయదారులు ఇబ్బంది పడుతున్నారు. గత సంవత్సరం కుడకుడ ప్రాంతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వం చర్యలు తీసుకున్నా ముందుకు సాగలేదు. దీంతో ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

- సూర్యాపేట టౌన్

జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో కోదాడలో మాత్రమే సొంత భవనాన్ని నిర్మించి ప్రజలకు సేవలు అందిస్తున్నారు. సూర్యాపేట, హుజుర్‌నగర్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

సొంత భవనానికి అడ్డంకిగా డాక్యుమెంట్ రైటర్లు

సూర్యాపేటలో రిజిస్ట్రేషన్ కార్యాలయం సొంత భవనానికి డాక్యుమెంట్ రైటర్లే అడ్డంకిగా మారారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అద్దె భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉన్నందున డాక్యుమెంట్ రైటర్ల వ్యాపారం మూడు పువ్వులు..ఆరు కాయలు చందంగా మారింది. జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎన్నో ఏళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఈ అద్దె భవనం చుట్టుపక్కల 60నుంచి 70 దుకాణాలను డాక్యు మెంట్ రైటర్లు అద్దెకు తీసుకుని వ్యాపారం చేస్తున్నారు. వీరితో పాటు భవన నిర్మాణ ప్లానర్లు, జిరాక్స్ సెంటర్లు నిర్వాహకులు కూడా దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు.

కోదాడలో పూర్తయిన భవనం

కోదాడలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. అదే విధంగా హుజూర్‌నగర్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం భవన నిర్మాణానికి స్థలాన్ని అధికారులు గుర్తించారు. కానీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. దీంతో అక్కడ కూడా అద్దె భవనంలో కార్యాలయం నడుస్తోంది.

ఆందోళనలు.. రాస్తారోకోలు..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గత ఏడాది కుడకుడ ప్రాంతంలోకి మార్చాలని అధికారులు యత్నించారు. ఈనిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ డాక్యుమెంట్ రైటర్లు ఆందోళనలు,రాస్తారోకోలు చేశారు.దీంతో సొంత భవనం కార్యాచరణ తాత్కాలికంగా ఆగిపోయింది. ముఖ్యంగా పట్టణానికి దూరంగా కార్యాలయం ఉంటే నగదు తీసుకునివెళ్లే సమయంలో ఇబ్బంది ఉంటుందని, కార్యాలయం చుట్టుపక్కల అందరికీ అనువైన దుకాణాలు, భవనాలు ఉండవని డాక్యుమెంట్ రైటర్లు వాదిస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సరైన వసతులు లేనందున తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా నీటి సౌకర్యం లేదు. సరైన బాత్‌రూంలు లేవు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఎక్కువ మంది వస్తే కూర్చోవడానికి స్థలం కూడాలేదు సొంత భవనం ఏర్పాటు చేస్తే అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి.

\- యార్లగడ్డ రామారావు, సూర్యాపేట

ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం. జిల్లాలో ఎన్నికల కోడ్ ఉన్నందున సొంత భవనాలకు సంబంధించిన కార్యాచరణ కొంత ఆలస్యమైంది.

\- మహ్మద్ షఫీ, సబ్ రిజిస్ట్రార్, హుజూర్‌నగర్

ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, క్రయ, విక్రయదారులు

సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతున్నందున సరైన వసతులు లేక ఉద్యోగులు, క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తుంటారు. కనీస వసతులు లేనందు ఇబ్బందులు పడుతున్నారు. సూర్యాపేటలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నూతన భవనాన్ని త్వరగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా: బాలునాయక్



దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, జూన్ 17: దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చింతపల్లి మండలం వింజమూరు కలియుగ హరిహర వేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో సోమవారం ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ కోరిన కోరికలు నెరవేర్చే దైవంగా వేంకటేశ్వరస్వామికి పేరుందని, దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే బాలునాయక్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ భవానీపవన్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణం, నాయకులు యాదగిరిగౌడ్, సంజీవరెడ్డి, హరినాయక్, ఆలయకమిటీ నిర్వాహకులు, ప్రజలు పాల్గొన్నారు.

తెల్‌దేవర్‌పల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చందంపేట: మండలంలోని తెల్‌దేవరపల్లి గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే బాలునాయక్ శంకుస్థాపన చేశారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం, దేవాలయ ఆర్చీకి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందంపేట మండల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బద్యానాయక్, పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి, ఎంపీపీ పార్వతి, జడ్పీటీసీ బుజ్జి లచ్చిరాం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్సీ కోటిరెడ్డి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి (సాగర్), జూన్ 17: గ్రామాల అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని బోయగూడెం గ్రామంలో సీడీపీ నిధుల ద్వారా మంజూరైన రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించే మట్టి రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అల్లిపెద్దిరాజుయాదవ్, మాజీ సర్పంచ్ నెమలి కృష్ణారెడ్డి, నాయకులు కూన్‌రెడ్డి లింగారెడ్డి, మాలె సత్యంరెడ్డి, పోదిల మల్లయ్య యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, జలందర్‌రెడ్డి, నెమలి మల్లారెడ్డా, నెమలి సత్యంరెడ్డి, రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సీతారాములు

చిట్యాల, జూన్ 17: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని, అవి కేసీఆర్ వాగ్దానాల్లా మిగిలిపోకూడదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. సోమవారం చిట్యాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలయాపన చేయకుండా హామీలు వెంటనే అమలుచేయాలన్నారు. సాంకేతిక కారణాలను సాకుగా చూపెట్టి రైతులకు పంగనామాలు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగినందున అదనంగా బస్సులను నడపాలని కోరారు. హామీలను అమలుచేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో నాయకులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, శీలా రాజయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యం



పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నిడమనూరు, జూన్ 17: ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చిన పాక లక్ష్మీనారాయణ అన్నారు. నిడమనూరులోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పార్టీ మండ ల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు ముగిసినందున ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలన్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనందున రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలన్నారు. కల్తీ, విత్తనాలు, ఎరువులు అరికట్టేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా అమలు చేయాలన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ గ్రాఫ్ తగ్గిపోయిందని, ఎన్నికల్లో అయోధ్య రామమందిరం అంశం పని చేయలేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటుపరం అవుతున్నాయని ఆరోపించారు. బీజేపీ మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా పని చేయాలన్నారు. ప్రజల కోసం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు కొండేటి శ్రీను, కందుకూరి కోటేష్, కత్తి లింగారెడ్డి, కొమాండ్ల గుర్వయ్య, నల్లబోతు సోమయ్య, ఆకారపు నరేష్, వింజమూరి శివ, చంద్రశేఖర్, బాలనారాయణ, కేశవులు, రాములు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

దేవరకొండ, జూన్ 17: స్పోర్ట్స్ అసోసియేషన్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తుందని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి తాళ్ల సురేష్ అన్నారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో అంతర్జాతీయ కరాటే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్ల సురేష్, కరాటే మాస్టర్ శ్రీను సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు, యువతకు కరాటేలో శిక్షణ ఇచ్చి వేసవి శిబిరాలు ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు కృష్ణ కిషోర్, మాస్టర్ జగన్, ఉమేష్, నిరంజన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం హామీలను అమలుచేయాలి



శాలిగౌరారంలో మాట్లాడుతున్న కందాల ప్రమీల

శాలిగౌరారం, జూన్ 17: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల డిమాండ్ చేశారు. శాలిగౌరారం మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో వేగం పెంచాలన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులకు రైతుబంధుతో పాటుగా పండించిన పంటకు బోనస్, రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి చెలకాని మల్లయ్య, సీనియర్ నాయకులు కల్లూరి లింగయ్య, డెంకల లింగయ్య, బుచ్చిరాములు, సైదులు, శ్రీను, జగన్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో మతపెద్దలకు శుభాకాంక్షలు తెలుపుతున్న గుత్తా



నకిరేకల్‌లో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎస్పీ చందనాదీప్తి, నాయకులు



దేవరకొండలో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బాలునాయక్



మల్లేపల్లిలో



మిర్యాలగూడలో మత పెద్దలతో ఎమ్మెల్యే బీఎల్ఆర్



నల్లగొండలో శుభాకాంక్షలు తెలుపుతున్న మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్



నల్లగొండలో మత పెద్దలతో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



నిడమనూరు ఈద్గా వద్ద ముస్లింలు

త్యాగాలకు ప్రతీక బక్రీద్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పేర్కొన్నారు. సోమవారం జిల్లాలో ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యత, సహోదరభావాన్ని అందరూ అనుసరించాలన్నారు. ఇస్లాం మత విశ్వాసాల ప్రకారం జీవితకాలంలో తమ కష్టపడి సంపాదించిన సొమ్ముతో రాగద్వేషాలకు అతీతంగా ఒక్కసారైనా హజ్‌యాత్ర చేయాలని ఉందన్నారు. ప్రేమ, త్యాగాలకు గుర్తుగా ముస్లిం సోదరులు బక్రీద్‌ను నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రతీ ముస్లిం ఈ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారని అన్నారు. మత గురువులు ముస్లింలతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. ప్రార్థనలు ముగిసిన అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు ముస్లిం పెద్దలు, ముస్లింలకు ఈద్ ముబారక్ తెలియజేశారు. ముస్లింలు ఒకరికొకరు అలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెద్దల సమాధుల వద్దకు వెళ్లి పూలు చల్లి వారి ఆత్మశాంతి కోసం దువా చేశారు. స్థాయికి తగినట్లుగా దానధర్మాలు చేశారు. గొర్రెలను, మేకలను బలి చేసి ఆ మాంసాన్ని మూడు భాగాలుగా చేసి బంధువులకు, స్నేహితులకు, పేదలకు అందజేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు బాలునాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. మిర్యాలగూడలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, విజయసింహారెడ్డిలతో కలిసి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మత పెద్దలకు, ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



తిప్పర్తిలో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు



కనగల్‌లో ఈద్గా వద్ద ముస్లింలు



కట్టంగూరులో...



నల్లగొండలో మాట్లాడుతున్న మత పెద్ద

బీసీలు బలమైన వర్గాలుగా ముందుకు సాగాలి

● ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తీన్మార్ మల్లన్న

నల్లగొండ టౌన్, జూన్ 17: బీసీలంటే బలహీన వర్గాలకు చెందిన వారిగా కాకుండా బలమైన వర్గాలుగా ముందుకు సాగాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం అనంతరం మొదటిసారిగా సోమవారం పట్టణానికి విచ్చేసిన తీన్మార్ మల్లన్నకు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో వివిధ బీసీ కులసంఘాల నాయకులు మల్లన్నను శాలువాలు పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో రాష్ట్రంలో కులగణన చేపట్టబోతుందని దాన్ని బీసీలంతా బ్రహ్మాస్త్రంగా వాడుకోవాలన్నారు. కులగణనలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కాసోజు విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, సోమమల్లయ్య, వేణుగోపాల్, కాశయ్య గౌడ్, తరాల పరమేష్ యాదవ్, చిక్కుల రాములు, కేశబోయిన శంకర్ ముదిరాజు, వెంకటనర్సయ్య, లక్ష్మయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

● **ఎమ్మెల్సీని సన్మానించిన విద్యుత్ ఉద్యోగులు**

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న విద్యుత్ ఉద్యోగుల సంఘం 327 (ఐఎన్‌టీయూసీ) నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం, ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీజీఎస్‌పీడీసీఎల్ విద్యుత్ ఉద్యోగుల సంఘం 327రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సురేష్‌కుమార్, ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మద్ది శ్రీనివాస్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్, కోశాధికారి యాదగిరి, డివిజన్ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

● **ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి**

ముస్లిం సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. బక్రీద్ సందర్భంగా సోమవారం పట్టణంలోని నిర్వహించిన ముస్లిం సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అందరికి అందుబాటులో ఉంటూ తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కారానికి తప్పక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ ఏకెఖాన్, జునైద్ హస్మీ, విలియం, శౌరయ్య, షఫీ నమాజ్, అస్రఫ్, మౌలానా యాసర్, రావూఫ్, అజ్మత్ పాల్గొన్నారు.

● **మున్నూరు కాపుల సంక్షేమానికి కృషి**

మున్నూరు కాపుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. పట్టణంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను మున్నూరు కాపులకు అందేవిధంగా చూస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటనర్సయ్య, పట్టణ అధ్యక్షుడు ఇంద్రయ్య, కేశవులు, కుంభం నర్సింహ, అనిల్‌కుమార్, వైద్యుల సత్యనారాయణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న అప్పటి విద్యార్థులు

నల్లగొండ కల్చరల్, జూన్ 17: మునుగోడు జడ్పీ హైస్కూల్ 1993-94 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని సోమవారం నల్లగొండలో ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆహ్లాదకరంగా జరిపారు. పూర్వ విద్యార్థుల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి ఉండటంతో అప్పటి విద్యార్థులందరూ ఆయనతో కలిసి ఆనందంగా గడిపి అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మిర్యాల స్వామి, గోలి రవికుమార్, శివకోటి, అద్దంకి మురళి, వేముల వెంకట్, ఎం.శోభన్‌బాబు, సల్వాది నర్సింహ, రాములు, యాదగిరి, కోడి రాములు, గణేష్, యాదయ్య, వెంకటాచారి, సుల్తానా, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

నార్కట్‌పల్లి: నీట్ యూజీ ఎగ్జామ్ వ్యవహారంలో తప్పు చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లె పరమేష్ డిమాండ్ చేశారు. నార్కట్‌పల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిన కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. నీట్ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని, బాధితులను శిక్షించాలన్నారు. కష్టపడి చదివిన విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలని కోరారు.

దేవరకొండ : దేవరకొండలో బక్రీద్ పండగను పురస్కరించుకుని కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన ఆటో డ్రైవర్ అబ్దుల్ రషీద్ కుటుంబానికి రూ.13వేల నగదు, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేసినట్లు హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

కట్టంగూరు : మండలంలోని అయిటిపాముల గ్రామంలో సోమవారం సీతారామాంజనేయ శివచెన్నకేశవ ఆలయ వార్షికోత్సవాన్ని ప్రజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో హోమం, అభిషేకాలు, శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. బొడ్రాయి వేడుకల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ చెవుగోని నాగరాజు, నాయకులు పెద్ది సుక్కయ్య పాల్గొన్నారు.

పెద్దవూర : మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడపాలని బీజేపీ నియోజకవర్గ ఎస్టీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ పాల్తి శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని ఊట్లపల్లి ఉనంచి మిర్యాలగూడ బస్ డిపో వరకు బస్సులు నడిచేలా ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఆయన అన్నారు.

నల్లగొండ కల్చరల్ : నల్లగొండ పట్టణంలోని బీట్‌మార్కెట్‌లో గల శ్రీ వాసవీమాత ఉమామహేశ్వర స్వామి సహిత శ్రీ రామకోటి స్థూప దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ కన్వీనర్ రేపాల భద్రాద్రి రాములు అన్నారు. సోమవారం ఆలయంలో జరిగిన ట్రస్టు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయాన్ని అన్ని విధాలుగా భక్తులకు అనుగుణంగా వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ట్రస్టు సభ్యులు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, నెహ్రూ పాల్గొన్నారు.

మర్రిగూడ: గ్రామాభివృద్ధికి గ్రామపంచాయతీ కార్యదర్శి శిరీష ఎంతో కృషి చేశారని ఎంపీపీ రాజమణి అన్నారు. తమ్మడపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి శిరీష ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్తుండగా గ్రామపంచాయతీ కార్యాయంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా గ్రామ అభివృద్ధికి శిరీష ఎంతో కృషి చేసిందని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి కార్యదర్శి పాండురంగారావు, మాజీ సర్పంచులు కె.మాదవిరమేష్, అయిలి లక్ష్మీనర్సింహ్మ, జిల్లా సురేష్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ : అడవిదేవులపల్లి మండలం జిలకరకుంట తండాకు చెందిన బిఆర్ఎస్ కార్యకర్త రమావత్ రూప్లా ప్రమాదవశాత్తు తేలుకాటుకు గురై గత ఏడాది అక్టోబర్‌లో మరణించాడు. దీంతో పార్టీ సభ్యత్వ బీమా 2 లక్షల విలువగల చెక్కును మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, శాసనమండలి చైర్మన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి రూప్లా భార్య విజయకు చెక్కును అందజేశారు.

మునుగోడు : మునుగోడు మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన యాట సైదులు కుటుంబ సభ్యులకు స్థానికానికి చెందిన పాలకూరి నర్సింహగౌడ్ తన సొంతంగా రూ. 5వేలు సాయంగా అందజేశారు. ఆయన వెంట నాయకులు విజయ్‌గౌడ్, యాదయ్య, రామస్వామి, శివ, సురేందర్, సాయి, గణేష్, కార్తీక్ ఉన్నారు.

బావి మట్టితో ఊరకుంట పూడ్చివేత



బావిలోని మట్టిని కుంట మధ్యలో పోసిన దృశ్యం



రైతు పట్టాభూమిలో తొవ్వుతున్న బావి

డిండి, జూన్ 17: డిండి మండలంలోని కామేపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు తన పట్టా భూమిలో వ్యవసాయ బావి తీస్తున్నాడు. వచ్చిన మట్టిని నీటి పారుదలశాఖ ఆధీనంలోని ఊరకుంటలో పోస్తున్నాడు. దీంతో ఊరకుంట పూడిపోతుందని గ్రామానికి చెందిన రైతులు ఈ నెల 15న గ్రామపంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. డిండి ప్రాజెక్టు నిర్మాణ సమయంలో రైతులకు సాగు నీరు అందించేందుకు సర్వే నెంబర్ 3.18 ఎకరాల విస్తీర్ణంలో ఊరకుంటను నిర్మించారు. డిండి ప్రాజెక్టు నీటితో ఊరకుంటను నింపి రైతుల పొలాలకు సాగునీరు అందిస్తున్నారు. ఈ ఊరకుంట పరిధిలో సుమారు 300 ఎకరాల భూమి సాగవుతుంది. 18 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊరకుంట 12 ఎకరాలకు పరిమితమైంది. 15 రోజులుగా ఓ గ్రామానికి చెందిన రైతు ఎలాంటి అనుమతులు లేకుండా మట్టితో ఊరకుంటను పూడ్చేస్తున్నాడు. ఇప్పటికే కుంట నుంచి సుమారు 300 టిప్పర్ల మట్టిని వేరొక చోట ఉన్న తన వ్యవసాయ భూమికి తరలించాడు. బావిలో వెళ్లే రాళ్లను కుంట కట్టపై పోస్తుండటంతో రాళ్లు, మట్టి కుంటలోకి జారుతున్నాయి. కుంటను పూడ్చటంతో కుంట నిండిన సమయంలో కుంట బ్యాక్ వాటర్ గ్రామంలోకి వస్తుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నీటి పారుదలశాఖ ఏఈ ఫయాజ్‌ను వివరణ కోరగా కుంటలో మట్టిపోసే పనిని నిలిపివేస్తామని అన్నారు.

ఎట్టకేలకు మిగులు భూమి స్వాధీనం



మునుగోడులో చేనేత కార్మికుల స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

మునుగోడు, జూన్ 17: మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా ఆర్‌అండ్‌బీ రహదారి వెంట ఉన్న ప్రభుత్వానికి సంబంధించిన సుమారు 10గుంటల విస్తీర్ణంలో అక్రమ కబ్జాకు గురైన మిగులు భూమిని రెవెన్యూ అధికారులు సోమవారం ఎట్టకేలకు స్వాధీనం చేసుకున్నారు. చేనేత క్లస్టర్ ఏర్పాటు కోసం అవసరమైన స్థలాన్ని ఇవ్వాలని నేత కార్మికుల విన్నపం మేరకు అప్పటి ప్రభుత్వం 20గుంటల స్థలాన్ని కేటాయించి, పట్టా ధ్రువీకరణ పత్రం అందజేసింది. కానీ ఆ భూమి వెంట సుమారు 10గుంటల మిగులు భూమిని చేనేత సహకార సంఘం నేతలు గుర్తించారు. మార్కెట్ విలువ ప్రకారం కోట్ల విలువ చేసే ఆ భూమిని సొంతం చేసుకునేందుకు పన్నాగం పన్నిన నేతలు నేత బజారు వీవర్స్ అసోసియేషన్ అంటూ కార్మికుల పేరుతో కొత్తగా సొసైటీని ఏర్పాటు చేసి అక్రమ మార్గాన హక్కులను సైతం పొందారు. ఆ భూమిని చేనేత సహకార సంఘం పాలక వర్గం నేతలే క్రయవిక్రయించారు. కానీ ఆ భూమిని విక్రయించిన వ్యక్తే కొనుగోలు చేసిన తంతుపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం జరిగిన ఈఅక్రమ వ్యవహారంపై పాఠకులు ఇచ్చిన సమాచారంపై సమగ్ర వివరాలతో 'మిగులు భూమిని మింగేశారు' అంటూ గత ఫిబ్రవరి 29న 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈమేరకు నేత కార్మికులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుని తమకు అవసరమైన స్థలాన్ని కేటాయించి న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈవ్యవహారంపై తాజాగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా విచారణ జరిపి కార్మికులకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు ఎన్నిక నిర్వహణలో బిజీగా ఉన్న అధికారులు కోడ్ అనంతరం ఆ భూమికి సర్వే నిర్వహించి చేనేత క్లస్టర్‌కు కెటాయించిన 20గుంటల స్థలంతో పాటు పదిగుంటల మిగులు భూమిని గుర్తించి స్వాధీనం పరుచుకున్నట్లు స్థానిక తహసీల్దార్ నరేందర్ తెలిపారు. ఈభూమి హక్కులు పొందిన వ్యవహారంపై వివరాలు తెలుసుకునేందుకు చేనేత సహకార సంఘం నేతలకు నోటీసులు ఇవ్వనున్నామని పేర్కొన్నారు.